సీరియల్

విషసర్పాలు

సికిందర్

(గత సంచిక తరువాయి)

వాళ్ళిద్దరిప్పుడు ఉదయం పదిగంటలకి కలుసుకుని మాట్లాడుకుంటున్నారు. కృష్ణన్ అన్నాడు, "జాన్ నాకు ఫోన్ చేశాడు రాత్రి. హత్యాస్థలాల్లో మొన్న తీసిన ఫోటోల్లో ఆ మైక్రోఫోన్స్ ఆగంతుల్ని డ్రింక్ మోర్ బార్ వాళ్ళు గుర్తిస్తారేమో చూస్తానన్నాడు. మళ్ళీ ఫోన్ చేస్తానన్నాడు. కానీ చేయలేదు. అతను వెళ్ళిన కారు మనకు రాత్రే ద్వారకాముందు దొరికింది.... నాకొకటి అనిపిస్తోంది, మిష్టర్ లాల్."

"ఏమిటి?"

"శత్రువులకి రెండు స్థావరాలుండాలని."

"అవును."

"ఒక స్థావరంలోంచి మీరు వస్తూండగానే, మరో దాంట్లో జాన్ బందీ అయిపోయినట్లున్నాడు."

"ఓహ్...."

"అతను మీకోసమే వెళ్ళాడు. మీరిలా బయటి కొచ్చారు, అతనలా లోపలికెళ్ళాడు.... అంతే జరిగింది. వాళ్ళు మీ కారును తమ వద్ద వుంచుకోదలచలేదు. అందుకే ద్వారకాముందు వదిలేసిపోయారు."

లాల్ తలూపాడు. "అదే జరిగివుండవచ్చు....ఓ.కే., కెవర్ మైండ్. అతనికేమీ కాదు. వాళ్ళు హాని చేయరు. వాళ్ళకా ఆలోచనలేదు. నన్ను తమ అతిధిగా బాగానే చూసుకున్నారు, వాళ్ళ మనిషిని నేనొకడ్ని చంపినప్పటికీ, నో, జాన్ని వాళ్ళు అతిధిగానే వుంచుకుని ఆపరేషన్ పూర్తయ్యాక వదిలేస్తారు."

"అలాగే ఆశిద్దాం" అన్నాడు కృష్ణన్ వాచీ చూసుకుంటూ, "పదిన్నరయింది, ఇక వెళ్దామా?"

తలూపాడు లాల్ లేస్తూ.

* * *

"జంటిల్‌మెన్, నగరంలో మరికొన్ని హత్యలు జరిగాయి. మనం నివారణోపాయాలెన్ని ఆలోచించినా ఈ హత్యలు నిరాటంకంగా జరిగిపోయాయంటే, మన వ్యవస్థలో, మన ఆలోచనల్లో యెక్కడో లోపముందని తెలుస్తోంది....సత్వరం ఈ లోపాన్ని కనుక్కొని మనం సరిదిద్దుకోకపోతే ఈ హత్యల పరంపరకి అంతుండదు. పబ్లిక్‌లో మన ఇమేజ్ దెబ్బ తింటుంది. ఇప్పటికే ప్రజలు మన అసమర్థతని వేలెత్తి చూపుతున్నారు. మినిస్ట్రియల్ లెవల్లోంచి కాల్ మీద కాల్స్ వస్తున్నాయి సంజాయిషీ కోసం....

"నిన్న మనం ప్రజలకి అన్ని జాగ్రత్తలు హెచ్చరించినప్పటికీ ఈ మూడు హత్యలు జరిగిపోయాయి. సుహాసినీదేవి యధేచ్ఛగా రాత్రి స్వైర విహారం చేసింది! ఆఫ్‌కోర్స్, ఒక ప్రయత్నం విఫలమైంది. ఈ హతులందరూ తమకేం కాదనే గుడ్డినమ్మకంతోనో, లేక అసలీ పరిస్థితుల గురించి తెలియకనో, లేక అంత త్వరలో తమకలాటిది జరుగుతుందని వూహించకనో వున్నారు.

అందుకే వాళ్ళు మన హెచ్చరికల్ని పాటించలేదు. ఎవరూ మనం కోరిన ప్రకారం పోలీస్ స్టేషన్స్‌లో ఇన్ఫర్మేషన్ అందివ్వలేదు. బహుశ రేపు చూద్దాం అనుకొని వుంటారు. దీనికొక కారణముంది, జంటిల్ మెన్."

"అదేమిటంటే, మనం స్నేక్ సొసైటీ ఉత్తరాల్ని స్వాధీనపర్చుకున్నామని నిన్న ప్రకటించాం. అది వాళ్ళలో భయాందోళనల్ని తొలగించి వుంటుంది. మరొకటి, ఇకముందు వ్రాయబోయే లేఖకులకి తమ వివరాలు పోలీసుల చేతుల్లో వుంటాయనే భయంకలిగి ఆ ప్రయత్నానికి సాహసించరనుకుని వుంటారు. ఈ రెండూ సరైనవే. అయితే పొరపాటు ఎక్కడవుందంటే ఆ రోజే—అప్పటికప్పుడే చాలా ఉత్తరాలు సొసైటీకి చేరిపోయాయని తెలియకపోవడంలో."

"జంటిల్ మెన్, ఈ అనర్థం మన ఆలోచనా లోపం వల్లే జరిగిందని ఒప్పుకోవాలి. సొసైటీకి ఉత్తరాలెలా అందాయి? పోస్టాఫీసుల్లోంచి కాదు. స్పెషల్ బ్రాంచి క్లారిఫై చేస్తోంది. మరి క్లియరెన్స్ బాయ్స్‌మీద దాడులు జరిపికూడా కాదు. వాళ్ళంతా సురక్షితంగా బ్యాగుల్ని పోస్టాఫీసులకి చేరవేశారు. అయితే గమనించాల్సింది, వాళ్ళ కలెక్షన్‌లో సొసైటీ ఉత్తరం ఒక్కటీ లేకపోవడం! కేవలం మనవు పోస్టాఫీసులవద్ద లెటర్ బాక్సుల లోనే అవి లభించాయి, చాలా తక్కువ సంఖ్యలో, ముప్పైరెండు మాత్రమే. దీన్నిబట్టి ఒక్కటే స్పష్టమవుతోంది...."

"అదేమిటంటే, జంటిల్ మెన్, క్లియరెన్స్ టైము కంటే ముందుగానే నిన్న నగరంలోని అనేక ప్రాంతాలలో లెటర్ బాక్స్‌లు అనధికారంగా తెరువ

బడ్డాయని! వాటిలోంచి స్నేక్ సాపైటీకి పోస్టయిన ఉత్తరాలు మాత్రం మాయమయ్యాయి. అలా చేయడం పోస్టాఫీసుల్లో వీలుకాదు కాబట్టి, అక్కడి బాప్సుల జోలికి పోలేదు. ఓన్లీ గాడ్ నోస్! వాళ్ళకెన్ని ఉత్తరాలు లభించాయో మనం వూహించలేం!"

ఇంతవరకు చెప్పి, అందరివంకా చూశాడు డి.జి.పి.

కాన్ఫరెన్స్లో అందరూ తలలు పంకిస్తూ శ్రద్ధగా వింటున్నారు.

"జంటిల్ మెన్" తిరిగి కొనసాగించాడతను. "నిన్నటి హత్యలు, ఈ మూడు హత్యలూ ఇదివరకు జరిగిన ప్రకారమే జరిగాయి—గుండెల్లో పొడిచి, అవే రకం కత్తులతో. కాకపోతే ఈసారి కత్తులకి లేబుల్స్ లేవు. వాళ్ళ ఉద్దేశ్యం స్పష్టమవుతోంది — ఆ ఉత్తరాలు వ్రాసిన వాళ్ళని ఇంప్లికేట్ చేయదల్చుకోలేదు వాళ్ళు. కాబట్టి ఆ లేఖకులని కనుక్కోవడం మనకు దుస్సాధ్యం—ఒకవేళ హితుల సన్నిహితుల కెవరికైనా వాళ్ళ ప్రైవేట్ జీవితాల గురించి తెలిసివుంటే తప్ప. అప్పుడు వాళ్ళు ముందుకొస్తారనే గ్యారంటీ కూడా లేదు.

"ఈ మూడు హత్యాప్రయత్నాల్లోనూ మనకే ఆధారమూ దొరకలేదు. వేలిముద్రలు లేవు. ఆమె గ్లవ్స్ ధరిస్తోంది. నాలుగో ప్రయత్నం జనార్ధనరావనే అంబర్ పేట నివాసి అయిన లెక్చరర్ మీద జరిగినప్పుడు, అతడామెని అదే కత్తితో గాయపర్చి తప్పించుకోగల్గాడు. ఆమె కారెక్కి పారిపోయింది. ఆ కన్ఫ్యూజన్ లో జనంలో ఎవరూ కారు నెంబర్ చూడలేకపోయారు. కానీ దాన్ని వైట్ అంబాసిడర్ గా గుర్తించారు.

"ఆ కత్తిని జనార్ధనరావు పోలీస్ స్టేషన్ లో అందిం

చాడు. దాన్ని రక్తం మరకలతో సహా ప్రిజర్వ్ చేయడం జరిగింది. కానీ జనార్ధనరావ్ తనమీద ఎవరీ ప్రయత్నం చేయించిందీ వెల్లడించడానికి నిరాకరిస్తున్నాడు. పరువు ప్రతిష్టల భయానికయి వుంటుంది—

"ఇక మనం మేల్కొనాలి. ఇంకా ఇలా ఘోరాలు జరగడానికి వీల్లేదు. థాంక్ గాడ్, రాత్రి ఆ నాల్గో ప్రయత్నం విఫలం గాకపోతే ఇంకెన్ని హత్యలు జరిగేవో! తన కారు నెంబర్ తెలిసిపోయి పోలీసులు ఎలర్టు అవుతారనే భయానికి అంతటితో ముగించుకొని ఆమె వెళ్ళిపోయింది. లేకపోతే మరికొన్ని హత్యలు నిశ్చయంగా జరిగేవి....

"ఇవ్వాల్టినించి పాట్రోలింగ్ రాత్రిపూట మరింత పటిష్టం చేయాలి. ఆమె మళ్ళీ అదే కారులో వస్తుందనుకోను. కన్పించే ప్రతీ కారుని సుహాసిని కోసం చెక్ చేయాలి. షి ఈజె పర్ వర్టెడ్ కేస్. సైకో మేనియాక్ అండ్ ఎ డేంజరస్ మర్డరెస్. ఆమెను సజీవంగా పట్టుకోవడం సాధ్యం గాకపోతే — వి మస్ట్ నాట్ హెసిటేట్ టు షూట్ హార్ డవున్!

"అలాగని ఆమె కన్పించిందే తడవుగా ఆ పని చేయకండి—ఇట్ షుడ్ బి ది లాస్ట్ రిసార్టు. ట్రిగ్గర్ హేపీ ఆఫీసర్స్ సహనం పాటించాలి."

"మన ఆఫీసర్లు చాలా సహనపరులు, సానుభూతి పరులు కూడా. ఆడ ప్రాణి యెంత క్రూరమైనదైనా సరే కన్పించిందే తడవుగా ఆయుధాలు ప్రయోగించరు వాళ్లు" అన్నాడు లాల్ అందర్నీ నవ్వుతూ చూస్తూ.

అక్కడున్న వాళ్ళంతా మొహమాటంగా, ఇబ్బందిగా మొహాలు చూసుకుని తలలు దించుకున్నారు.

డి.జి.పి. కూడా నవ్వాడు. "ఆల్ రైట్, నా యూ సీ మిష్టర్ లాల్, యూ ఆర్ ది లీడింగ్ మేన్. మొదటి నించీ మీరిందులో ఇరుక్కుని వున్నారు కాబట్టి, కొంత కాలం వాళ్ళ ఆతిథ్యం పుచ్చుకుని వచ్చారు కాబట్టి, వాళ్ళ ఆకారాలనుంచీ మొత్తం వాళ్ళ మోడస్ ఆప రెండి గురించి మీకున్నంత విస్తృత పరిచయం మాకింకా ఏర్పడలేదు. కాబట్టి వాళ్ళ పూర్తి వ్యవహారాన్ని సత్వరం అంత మొందించడానికి మిమ్మల్ని సారథ్యం వహించమని కోరుతున్నాను...."

లాల్ వెంటనే తలూపాడు. "అయితే నేను కొన్ని సూచనలు చేయాలనుకుంటున్నాను....ప్రాణభయం వున్న వాళ్ళెవరైనా సరే, ఇప్పటికైనా వాళ్ళ బిడియం బెరుకు అన్నీ వదిలేసి, పోలీస్ స్టేషన్స్‌లో ఆ ఇన్ఫర్మేషన్ డిపాజిట్ చేయడం మంచిది.

"గ్యాంగ్ దగ్గర ఇంకా చాలా ఉత్తరాలున్నాయి. ఈ రోజు వాళ్ళెవరెవర్ని ఎన్నుకుంటున్నారో తెలియదు. చీకటిపడితే అందరూ జాగ్రత్తగా వుండాలి. యెవరూ తలుపుకొట్టిన వెంటనే వెళ్ళి తీయకూడదు. ముందు ఆ మనిషెవరో నిర్ధారించుకోవాలి. అనుమానం వేస్తే ఉపాయంగా పట్టుకోడానికి ప్రయత్నించాలి. లేదా భయం వేస్తే కేకలు వేసి ఇరుగుపొరుగువారిని ఎలర్టుచేయాలి.

"ఈ రోజు మళ్ళీ సుహాసిని ఫోటో ఈవెనింగర్స్‌లో వేసి, ఆమెని బాగా గుర్తుంచుకోమని ప్రజలకి విజ్ఞప్తి చేయాలి.

"ఇప్పుడు—కొన్ని గంటల్లో—సిటీలోని అన్ని లెటర్ బాక్సులకి తాళాలు మార్చేయమని ఆదేశించాలి. కొన్ని వందలుగా వున్న లెటర్ బాక్సులన్నిటివద్దా మనం నిఘా

ఏర్పాటు చేయలేం కనుక, ప్రతి గంటకూ వాటిలో క్లియరెన్స్ జరిగేటట్లు చూడమనాలి. వీలైనంతవరకు నిఘా కూడా ఏర్పాటు చేయాలి—

"ఇక సుహాసిని తిరిగి అదే కారులో గాని, అసలు వేరే కారులో గానీ వస్తుందనుకోలేం. ఇంకేదైనా ఒక వాహనాన్ని—లేదా వేర్వేరు వాహనాల్ని ఉపయోగించవచ్చు. ట్రైను, బస్సు, ఆటో, టాక్సీ, రిక్షా.... ఇలా ఏ పబ్లిక్ వాహనాల్లోనైనా బయల్దేరితే ఆనవాలు మరుగు పర్చుకోవచ్చు. బురఖా వేసుకొని, లేదా ఏ శాలువా లాంటిదో కప్పుకుని. దీన్నికూడా హెచ్చరించాలి."

లాల్ చెప్పి వాళ్ళ అభిప్రాయంకోసం చూశాడు.

వాళ్ళు అంగీకారంగా తలలూపారు.

కళ్ళు విప్పిచూశాడు జాన్.

• • •

తనెక్కడున్నాడో అక్కడే వున్నాడు, రాత్రినుంచీ ఇదే గది. ఆ గదిలో పైన వెంటిలేటర్‌లోంచి మాత్రం కొంత వెలుతురు వస్తోంది. లైటు లేదు, ఫ్యాను లేదు. ఇంట్లో శబ్దాలు, మాటలు స్పష్టంగా విన్పిస్తున్నాయి.

రాత్రి అతను దెబ్బతిని పడిపోయాక ఏం జరిగిందో తెలియదు. చాలా సేపటి తర్వాత కళ్ళు తెరచి చూస్తే ఈ గదిలో వున్నాడు, పడుకోబెట్టి. కట్టివేయలేదు. జేబుల్లో తన వస్తువులేవీ లేవు. చేతికి వాచీ కూడా లేదు.

అప్పుడొక ఎత్తుగా, భారీగా, ఒడిచెంపకు ఒరుపులో వున్న మనిషి వచ్చి, తనకేం ఫర్వాలేదని అన్నాడు. అన్ని సదుపాయాలూ చక్కగా అమరుతాయి, రెస్టు తీసుకోమన్నాడు.

తిరిగి తెల్లవారాక ఇద్దరు రివాల్వర్ మనుషులు వచ్చి

బాత్ రూంకి తోడ్కొని పోయారు. అక్కడ పావు గంటసేపు వుండనిచ్చి తిరిగి గదికి తెచ్చారు. మర్యాద చేశారు. ఫలహారాలు పెట్టారు. అవన్నీ సుష్టుగా ఆరగించి గాఢనిద్రపోయాడు జాన్. తిరిగి ఇప్పుడే కళ్ళు తెరిచాడు.

ఇప్పుడు చాలా దగ్గర్లో మాటలు విన్పిస్తున్నాయి. లేచి మంచం దిగి కుడివైపు గోడదగ్గరికి కదలాడు. చెవులు రిక్కించాడు. ఆ పక్క గదిలోంచే విన్పిస్తున్నాయి....

"మీ ఒక్కొక్కడి తెలివితక్కువతనానికి నాకు ఒళ్ళు మండిపోతోంది జింబో. మిమ్మల్ని షూట్ చేస్తాను...."

"ఆగు, ఈ ఒక్కసారికి క్షమించు. ఈ రాస్కెల్స్ వల్ల అలా జరిగింది. పోతే బ్రోతల్స్కి, లేకపోతే బఫూన్ పన్లు. వీళ్ళని నేను తీర్చిదిద్దుతాను, ఈ ఒక్కసారి క్షమించు...."

"ఇదింకా బాస్కి తెలియదు! లేకపోతే యాసిడ్లో పడుండేవాడ్ని ఈపాటికి నేను! ఇదెంత సీరియస్ సిట్యుయేషనో తెలుసా మీకు, మూషికల్లారా! ఆ డిటెక్టివ్ని తప్పించుకోనియ్యడమంటే మనం సూసైడ్ చేసుకోవడమే!"

"జాన్ ఉలిక్కిపడ్డాడు, ఈ చివరి మాటలకి.

"నో, ఆ డిటెక్టివ్ ఏమీ చేయలేడు. మన వ్యాను తీసుకెళ్ళాడు. కానీ దానివి ఫేక్ నెంబర్లు, ఆ యింటి ఓనర్ని పట్టుకుని మనల్ని ట్రేస్ చేయలేడు. మేం వస్తూ వాడి పీక నొక్కివచ్చాం."

"ఓకే, శభాస్ జింబో! ఇప్పుడు నీ తెలివిని మెచ్చుకుంటున్నాను.

"మరి ఇవ్వాళ మన ఆపరేషన్ —?"

"జరుగుతుంది. దానికి అడ్డులేదు. ఇదిగో లిస్టు తయారు

చేశాడు బాస్....ఇవ్వాళ్టి సుహాసిని కోటా ఇది...."

"గాడ్, ఇందర్నా!"

"నిన్నటి కోటా పూర్తిచేయలేదామె. అందుకని నిన్న మిగిలిందీ ఇవ్వాళ్టిదీ కలిపి ఇచ్చాడు బాస్. ఇవ్వాళ ఎలాగైనా పూర్తిచేయాలి. వెరీ బ్యాడ్ జింబో. ఇంకా మనకు లెటర్స్ దొరికేటట్టులేవు. వాళ్ళు మోసం గ్రహించే వుంటారు. మనం ఆ ఛాయలకి పోవడం ఇప్పుడు ప్రమాదకరం. నిన్నటి ముఠాని మాన్పించు. వాళ్ళ ఫీజు ఇచ్చేశాంగా? మళ్ళీ పరిస్థితులు అనుకూలిస్తే చూద్దాం. పైగా ఇప్పుడెవరూ! మనకు ఉత్తరాలు వ్రాస్తారనుకోను—"

"పోలీసులు చెడగొట్టారు, హెచ్చరికలు చేసి!"

"బాస్ రెచ్చిపోయాడు, జింబో. కానీ దీనికి మన ల్నేమీ అనలేదు. మనం ఉన్నంతలోనే యెక్కువ ఫలితాన్ని సాధించి తృప్తిపరచుదాం!"

"బాస్‌కి తృప్తిలేదు. శాడిస్టులకి తృప్తి వుంటుందా?"

"శాడిజంతో మనల్ని వేధించడంలేదు, అది నయం! ఇవ్వాళ అంతా సజావుగా సాగితే, రేపటికి పూర్తి కోటాతో ఆపరేషన్ని ముగించెయ్యొచ్చు, జింబో. ఆ తర్వాత బెంగుళూరు అంటున్నాడు, బాస్...."

"బెంగుళూరా? ఐ లవ్ దట్ ప్లేస్? ఐ లవ్ దట్ సిటీ!"

"ఆ తర్వాత బొంబాయి, కలకత్తా, న్యూఢిల్లీ, మద్రాసు, ఈ నాలుగుచోట్ల నెలరోజుల్లో ముగించుకుని డిస్‌బర్స్ అయిపోవాలి. బాస్ మిడిల్ ఈస్ట్ వెళ్ళిపోతాడు. అప్పుడు మనం వీలయితే వేరే ఆర్గనైషన్‌ని స్థాపించుకుందాం."

"ఐ లవ్ ఇట్! ఐ లవ్ ఇట్! మరి సుహాసిని—?"

"ఓహ్....ఆ పూర్ గర్ల్. మన యాక్టివిటీ పూర్తయ్యాక ఆమెని ఫినిష్ చేసెయ్యమన్నాడు బాస్."

"గాడ్! ఈ ఉద్రేకంలో ఆమె మనం తనకేం చేశామో ఆలోచించడంలేదు. యే క్షణంలోనైనా నార్మల్ కొస్తే తన ఫాదర్ చావుకి, లవర్ చావుకి, మదర్ చావుకి—బ్రదర్—మనల్ని బ్రతకనిస్తుందా అని!"

"ఆమె నార్మల్ కి రాకుండా చూడాలి. ఆమె మన మీద తిరగబడకూడదు, యూసీ? లేకపోతే మనం, మన ఆపరేషనూ, టక్కుటమారాలన్నీ ఏక్ దమ్మున గోవిందా! యాసిడ్ లో పడడంకంటే అది ఘోరం కదూ?"

"ఓహ్, అలా అనకు. అసలు ఎక్కడుంది యాసిడ్ గుంట? బాస్ వూరికే అలా సినీ విలన్ స్టయిల్ లో బెదిరిస్తాడు గాని...."

"తవ్విస్తాడట, అప్పటికప్పుడు."

"పెద్ద శాడిస్టు!"

"పద, అతని దగ్గర కెళ్దాం. సెషన్ కి కూర్చోవాలి.."

వాళ్ళు వెళ్ళిపోతున్న అడుగులు.

ఆ తర్వాత నిశ్శబ్దం.

జాన్ తేరుకుని కదిలాడు. లాల్ తప్పించుకున్నట్లు తెలిసింది. అతన్ని ఇక్కడ బంధించలేదు. ఆ చోటు వేరే, ఈ చోటు ఎక్కడో తనకు బాగా తెలుసు. లాల్ ఎలా తెలుసుకుంటాడు?

అంతలో ఎవరిదో దగ్గు విన్పించింది, ఇటుపక్క గదిలోంచి.

ఆడ గొంతు.

జాన్ కలవర పడ్డాడు.

ఎవరది? సుహాసినియా?

ఆమె ప్రక్క గదిలోనే వుందా?

వేగంగా అటు నడిచి గోడకు చెవి ఆనించాడు. ఏమీ వినిపించలేదు మళ్ళీ. నిట్టూరుస్తూ వచ్చి పడుకున్నాడు. కప్పుకేసి చూస్తూ తీవ్రంగా ఆలోచించసాగాడు....ఎలా బయటపడాలి?

• • •

"నో! స్నేక్ సొసైటీ అలా చెయ్యదు! వాళ్ళు చంపుతున్నారు! నీలా బెదిరించరు! నువ్వు చెప్తున్నది అబద్ధం!"

సాధ్యమైనంత గొంతు పెంచి అరిచాడు విశ్వేశ్వర రావు, ఫోన్లో.

అరవై ఏళ్ళవాడు. ఇరవై ఏళ్ళయింది భార్య గతించి.

"సరే, మిస్టర్ రావ్. నా మాటలు నమ్మకపోతే నీ ఖర్మ! నీమీద మూడు ఉత్తరాలందాయి, నీ వీధిలో వాళ్ళే వ్రాశారు. వాళ్ళ పిల్లల్ని నువ్వు—యూ హేవ్ సెక్సువల్లీ ఎ సాల్టెడ్ దెమ్. కానీ చూస్తూ చూస్తూ నీ ముసలి ప్రాణాలు తీయడానికి మనసొప్పడంలేదు. మేం తీయదల్చుకుంటే నువ్వు చేయగల్గేదేమీలేదు కూడా. నీకు జరిమానాతో క్షమించేయాలనుకుంటున్నాం. ఇంతకు మించి గత్యంతరం నీకు లేదు. చెప్పు నీకేది ఇష్టం?"

"ఎంత కావాలి నీకు?"

"కనీసం మూడు లక్షలు."

రావ్ ఆలోచించాడు, "సరే, ఎప్పుడొస్తావు?"

"నువ్వే రావాలి."

"ఎక్కడికి?"

"వరంగల్ రూట్లో తాటితోపుకి..."

"వివరంగా చెప్పు."

కాస్సేపు అవతలనించి వేగంగా మాటలువినిపించాయి.

"అర మొందా? రాత్రి పన్నెండున్నరకి."

"అలాగే వస్తాను."

"నిన్ను గుర్తించడానికి ఈ కోడ్ చెప్పాలి...."

"ఏమిటది?"

"శ్వాస ప్రాణం-కాసుల బేరం" కట్ అయిందిలైను.

అతను నిట్టూరుస్తూ పెట్టేశాడు.

అవతల శంభూనాథ్ కూడా పెట్టేసి బిగ్గరగా నవ్వాడు. వెంటనే ప్రక్కనున్న యువతి ఎత్తి తను ఇంకో నెంబర్ తిప్పసాగింది....

"ఎలా వుంది, జింబో?"

జింబో సకిలిస్తూ గంతు లేయసాగాడు, "హై—హయ్యా! హై—హయ్యా! ధనమేరా అన్నిటికీ మూలం... ఆ ధనము విలువ తెలుసుకొనుట మానవ ధర్మం...."

శంభూనాథ్ విరగబడి నవ్వసాగాడు.

* * *

ఆ కారు చల్లని మెర్క్యురీ దీపాలకాంతిలో మెత్తగా జారిపోతోంది....

సమ వేగంతో, ఏ తొందరపాటూ లేకుండా, తీరిగ్గా సాగిపోతూన్న ఆ వైట్ అంబాసిడర్ని చూస్తే ఎవరికీ అనుమానం కలగదు—ఆ పరిస్థితుల్లో. , అది ఆపిన ప్రతి చోటా ఆగి, అనుమానాలు తీర్చిపోతోంది అధికారులకి.

ఆ కారులో వున్న ఒకే ఒక్క మనిషి—ఠీవిగా డ్రైవ్ చేస్తున్న ఆమెలో ఎలాంటి అదురూ బెదురూ లేవు. ప్రతి అడ్డంకివద్దా తను జయిస్తున్న గర్వపాటుగానీ, ప్రతి అధికారినీ చిత్తుచేస్తున్న మిడిసిపాటు గానీ, ఏ కోశానా ఆమెలో లేవు. ఆమె ముఖంలో ఎలాంటి భావాలూ లేవు.

అదెప్పటి స్థితిలోనే వుంది—శిలగా.

ఆమె కారు బాలానగర్ వైపు సాగిపోతోంది....

నైట్ పాట్రోలింగ్ చేస్తున్న పోలీసు వ్యానులు సాధ్యమైనంతవరకు ప్రతి వీధినీ కవరు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. అంతకుముందే సాయంకాలం వీధివీధికీ తిరిగి హెచ్చరికలు చేశారు. ప్రతి వీధిలోని యువకులు జట్లు జట్లుగా ఏర్పడి, వంతులవారీగా రాత్రి కాపలా వుండాలని కోరారు.

కానీ దానికెవరూ అంగీకరించలేదు. వాళ్ళంతా సుహాసిని చేస్తున్నదాన్నే బలపర్చారు. ఇదెవరో దుండగులు ధనంకోసం చేస్తున్న హత్యల గొడవకాదు. ఈ హత్యలు ఒక ఉన్నతాశయంతో జరుగుతున్నాయి. సమాజంలోని చీడపురుగుల్ని ఏరివేస్తోంది సుహాసిని. దీనికెప్పుడూ తమ సమ్మతి వుంటుందని సుహాసినీదేవి జిందాబాద్, స్నేక్ సొసైటీ వర్థిల్లాలి!!—అంటూ సహాయ నిరాకరణకే పూనుకున్నాయి, అన్ని విద్యార్థి సంస్థలూ.

పోలీసులకి సమస్య వచ్చి పడింది. దీన్నికపూర్తిగా తామే ఎదుర్కోవాలని నడుం కట్టారు. అయితే పైకి విశ్వాసంతోనే వున్నా, సరిపోని బలగంతో ఇది తమకు సాధ్యమేనా అన్న శంక పీకుతూనే వుంది.

ఒంటరి స్త్రీలతో తమకు తారసపడుతున్న ప్రతి కారు వర్ణనని, అది వెళ్తున్న మార్గాన్ని, టైమునీ ఎప్పటికప్పుడు ట్రాన్స్‌మిట్ చేయసాగారు.

ప్రస్తుతం వైర్‌లెస్ కారులో కృష్ణన్‌తో ప్రయాణిస్తూ ఆ వివరాలన్నీ రికార్డు చేస్తున్న లాల్, తదేకధ్యానంతో వాటిని ఎనలైజ్ చేయసాగాడు.

ఇప్పుడు సమయం ఒంటిగంటన్నరవుతోంది.

ఇంతవరకూ అనుమానాస్పదంగా ఏ కారూ తటస్థపడలేదు, పాట్రోలింగ్ స్క్వాడ్స్‌కి.

ఈ మూడు గంటలనుంచీ లాల్ రికార్డుచేసిన కార్ల సంఖ్య 211.

ఇందులో కేవలం ఒక్కసారే తారసపడ్డ కార్ల సంఖ్య 57.

రెండు మూడుసార్లు కన్పించిన సంఖ్య 122.

మూడునుంచి అయిదుసార్లు కన్పించినవి 31.

ఈ మూడు వర్గాలకి చెందినవీ — అవి తారసపడ్డ స్థానాల్ని గమనిస్తే — వాటి గమన మార్గాల్లో ఎలాంటి సంశయమూ కలగడంలేదు లాల్‌కి. అవన్నీ నేరుగా తమ గమ్యాలకే సాగిపోతున్నట్టు తెలుస్తోంది — వివిధ పాయింట్లవద్ద అవి తీసుకున్న ప్రయాణ కాలాన్ని బట్టి చూస్తే.

కానీ నాల్గో వర్గంగా ఇంకో కారుని — ఒకే ఒక్క కారుని కూడా విభజించాల్సి వచ్చింది.

ఇదే మిగిలిన వాటన్నింటికంటే భిన్నంగా వుంది.

ఇది పద్నాలుగుసార్లు తారసపడింది.

అన్నిసార్లూ వివిధ ప్రాంతాల్లో.

ప్రతిసారి తారసపడ్డప్పుడు తీసుకున్న టైము కూడా ఎక్కువే.

ప్రయాణ మార్గం అస్తవ్యస్తంగా వుంది.

అది 10:20కి యూనివర్సిటీ రోడ్‌లో కన్పిస్తే, పది నిమిషాల తర్వాత విద్యానగర్‌లో రెండుసార్లు కన్పించింది. 10:50కి అంబర్‌పేటలో రెండుసార్లు కన్పిస్తే, 11:15కి కాచీగూడలో మూడుచోట్ల కన్పించింది. 11:45కి దిల్‌సుఖ్‌నగర్‌లో ఒకచోట కన్పిస్తే, 12:10కి

ఈదీ బజార్ లో రెండుచోట్ల కన్పించింది. మళ్ళీ 12:23కి కారవాన్ లో కన్పిస్తే, 12:48కి మెహిదీ పట్నంలో కన్పించింది. తిరిగి 1:00కు లకడీకాపూల్ వద్ద కన్పిస్తే, 1:21కి బాలానగర్ లో కన్పించింది. అక్కడ్నించి ప్రస్తుతం లేటెస్టుగా అందిన దాన్నిబట్టి 1:42కి సనత్ నగర్ లో వుంది....

ఈ పరిశీలన లాల్ ని ఆందోళన పర్చింది.

అప్పటికే సమయం చాలా మించిపోయిందని అన్పించింది....

ఆ కారు వలయాకారంలో నగరాన్ని చుడుతోంది

అది వైట్ అంబాసిడర్, నంబర్ APQ 7070.

అందులో ఒక్క స్త్రీ మాత్రమే ప్రయాణిస్తోంది.

ఆమె వయసు పాతికలోపే వుంటుంది.

కానీ ఎందుకో ఆమె ఎక్కడా సుహాసినిగా గుర్తింపబడలేదు!

"వెల్, వెల్, యూ సీ కృష్ణన్, డిసీజ్ అవర్ డెస్టినేషన్!"

"ఏది?"

"ఈ APQ 7070 వైట్ అంబాసిడర్! ఇప్పుడే సనత్ నగర్ చేరింది!"

"ఆర్యూ ష్యూర్?"

"డామ్ ష్యూర్! కమాన్, లెటజ్ దేర్! ఎలర్ట్ ఫోర్స్, క్విక్!"

కృష్ణన్ సంభాషణ రిసీవరందుకుని అందులో అరుస్తూ సాగాడు. వాళ్ళ కారప్పుడు పబ్లిక్ గార్డెన్స్ దగ్గర వుంది.

(ఇంకా వుంది)